క్లుప్తంగా

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తాడికొండ: ఈ నెల 4వ తేదీన తాడికొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ బిక్కి మహేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు మండల స్థాయి అధికారులు తమ శాఖల పరిధిలోని అభివృద్ధి పనుల నివేదికలతో హాజరు కావాలని ఆయన సూచించారు.

తుళ్లూరులో అందుబాటులోకి రానున్న ఆధార్ సేవలు



తాడికొండ: తుళ్లూరు-1 సచివాలయంలో ఇకపై ఆధార్ సేవలు అందుబాటులోకి రానున్నట్లు ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా తుళ్లూరు-1 సచివాలయానికి నూతనంగా ఆధార్ నమోదు కిట్‌ను సచివాలయ సిబ్బందికి ఆయన అందజేశారు. మరో 10 రోజుల్లో తుళ్లూరులో ఆధార్ సేవలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ ప్రవీణ్, కార్యదర్శి టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అడ్డరోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

తాడికొండ: ప్రమాదాల నివారణకు తాడికొండ అడ్డరోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల అధ్యక్షుడు చింతల భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. తాడికొండ అడ్డరోడ్డు వైపుగా ట్రాఫిక్ రద్దీ పెరిగిపోయిందని, ఆటోలు, బస్సులు, ఇసుక లారీలు ఇటు సచివాలయంవైపు, అటు అమరావతి ప్రాంతానికి నిత్యం తిరుగుతున్నాయన్నారు. అడ్డరోడ్డు కూడలిలో స్పీడ్ బ్రేకర్లు లేని కారణంగా నాలుగు రోడ్ల కూడలి వద్ద వాహనాల వేగం తగ్గించకుండా వస్తున్న కారణంగా ప్రమాదాలకు నిలయంగా మారుతున్నందున ఆర్‌అండ్‌బీ అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

జనఔషధి వారోత్సవాల ర్యాలీ



మంగళగిరి: నగర పరిధిలోని నిర్మల ఫార్మసీ కళాశాల నోబెల్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం వలంటీర్లు గురువారం జన ఔషధి వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నుంచి నృసింహుని దేవస్థానం మీదుగా మిద్దె సెంటర్ వరకూ కొనసాగింది. ఈ సందర్భంగా డిప్లొమా ఫార్మసీ విద్యార్థులు జన ఔషధి మందులను వాడుదాం... అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. జన ఔషధి కో-ఆర్డినేటర్ అల్లు హరికృష్ణ, రోటరీ క్లబ్ మంగళగిరి శాఖ అధ్యక్షుడు త్రిపురమల్లు సతీష్ కళాశాల సెక్రటరీ సిస్టర్ జి.నిర్మల జ్యోతి, జాతీయ సేవా పథకం అధికారి రేఖా నరేష్ బాబు, శాంతి, మాధవిలతో పాటు పలువురు డిప్లొమా ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

24 గంటల్లో మంచినీటి కుళాయి

ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపిన ముస్లిం కాలనీ వాసులు



తాడేపల్లిరూరల్: మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి బుధవారం కొలనుకొండ వడ్డేశ్వరంలో విస్తృతంగా పర్యటించారు. ఎమ్మెల్యే పర్యటించే సందర్భంలో కొలనుకొండ ముస్లిం కాలనీకి చెందిన పలువురు మహిళలు మంచినీటి కుళాయి ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఆయన 24 గంటల వ్యవధిలో గురువారం మధ్యాహ్నానికి ముస్లిం కాలనీలో తాగునీటి కుళాయి ఏర్పాటు చేయించి అందుబాటులోకి తీసుకు వచ్చారు. అక్కడ వున్న బావిని ఉపయోగించుకోవడానికి వీలు లేకుండా ఉండడంతో దాన్ని సైతం బాగుచేయించి అందుబాటులోకి తీసుకు వచ్చారు. సమస్యను తెలిపిన వెంటనే స్పందించి మంచినీటి కుళాయి ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే ఆర్కేకు స్థానిక ముస్లింలు కృతజ్ఞతలు తెలియజేశారు.

జలపాలేశ్వరస్వామికి విశేషపూజలు

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని జలపాలేశ్వరస్వామికి పాల్గుణ శుద్ధ దశమిని పురస్కరించుకొని గురువారం విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే నమక చమకాలతో పంచామృత స్నపనను అర్చకుడు ఉమాపతిశాస్త్రి నిర్వహించారు. ముఖమండపంలోని వరసిద్ధి గణపతికి అభిషేకాలు చేసి అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం



గండాలయ స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు



ఆత్మకూరులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

గండాలయ స్వామి కొండ అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మంగళగిరి-తాడేపల్లి నగరాన్ని తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. గురువారం ఉదయం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి కొండపై దాతల సహకారంతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అన్నప్రసాద భవనంలో చేయాల్సిన ఏర్పాట్లు, వసతి గృహ నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ గండాలయ స్వామి కొండపై అన్నివసతులు సమకూరిస్తే భక్తులతో పాటు సందర్శకులు కొండకు తరలివస్తారన్నారు. కొండపై నుంచి నగరం మొత్తం ఎంతో అందంగా కన్పిస్తుందన్నారు. గండాలయ స్వామి కొండ అభివృద్ధికి దాత దేవతి భగవన్నారాయణ ముందుకు వచ్చినట్లుగానే మరింతమంది దాతలు ముందుకు రాలన్నారు. మరో వైపు లక్ష్మీనృసింహస్వామి కొండపై అటవీశాఖ ఆధ్వర్యంలో ట్రెక్కింగ్ ట్రాక్ నిర్మాణం, టెంపుల్ హిల్ ఏకో పార్కుల నిర్మాణంతో ఉదయం సాయంత్రం వేలల్లో వేలాది మంది తరలివచ్చి వాకింగ్ చేసుకోవడంతో పాటు ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేసుకుంటూ ఆరోగ్యంతో పాటు ఆహ్లాదాన్ని పొందుతున్నారన్నారు. ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి, పార్టీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆత్మకూరులో అభివృద్ధి పనుల పరిశీలన...

ఆత్మకూరు (మంగళగిరి): నాణ్యత లోపం లేకుండా అభివృద్ధి పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అధికారులకు సూచించారు. గురువారం నగర పరిధిలోని ఆత్మకూరులో విస్తృతంగా పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. తొలుత సచివాలయం వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సచివాలయం వద్ద నుంచి తెనాలి రోడ్డు వరకు జరుగుతున్న సీసీ డ్రెయిన్ పనులను, రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. అనంతరం గుంటూరు చానల్ వద్ద తాగునీటి పథకం ఆవరణలో జరుగుతున్న వాటర్ సంపు నిర్మాణం, స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ రింగ్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనులల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించకుండా త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. తెనాలి రోడ్డు నుంచి మంగళగిరి వైపు వచ్చే వాహనాలు రోడ్డు విస్తరణతో ఆత్మకూరు మీదుగా జాతీయ రహదారికి వెళ్లవచ్చునన్నారు. నిర్మల కళాశాల నుంచి తెనాలి రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్‌తో నాలుగు లైన్ల రోడ్డు అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే నిర్మలా కళాశాల నుంచి ఆత్మకూరు సచివాలయం వరకు సెంట్రల్ లైటింగ్‌తో నాలుగు లైన్ల రోడ్డు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని, త్వరలోనే సచివాలయం నుంచి తెనాలి రోడ్డు వరకు నాలుగు లైన్ల రోడ్డు అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మాజీ సర్పంచి, సీనియర్ నాయకుడు బొమ్ము శివరామిరెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లవరపు సుధారాణి, నగరపాలక సంస్థ అధికారులు కృష్ణారెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

ప్రతి ఇంట ఆనందమే సీఎం జగన్ లక్ష్యం



పింఛన్ పంపిణీ చేస్తున్న తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

మేడికొండూరు: రాష్ట్రంలో ప్రతి ఇల్లు ఆనందంగా ఉండడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, దానికి తగ్గట్లుగా వివిధ పథకాలతో అన్ని వర్గాలను ఆదుకుంటున్నారని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన మంగళగిరిపాడు, తురకపాలెం గ్రామాల్లో పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తురకపాలెం రైతులు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన 4వేల మందికి పైగా రైతులు ఎన్నో ఏళ్లుగా అగ్రహారానికి చెందిన 570 ఎకరాలను సాగు చేసుకుంటున్నారని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగిపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ గ్రామానికి చెందిన చిన్న, సన్నకారు రైతులు ఈభూములపై ఆధారపడి పంటలు సాగు చేసుకుని జీవిస్తున్నారన్నారు. 2011లో ప్రభుత్వం ఈ భూములకు రిజిస్ట్రేషన్ ఆపివేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈభూముల వల్ల 10వేల మందికి జీవనాధారం లభిస్తోందన్నారు. దీనిపై స్పందించిన కత్తెర సురేష్ కుమార్ నివేదిక తయారు చేయాలని కార్యదర్శికి సూచించారు. అదే విధంగా గ్రామలో డొంకరోడ్డు అభివృద్ధి చేయాలని, శ్మశానవాటికకు దారి కల్పించాలన్నారు. నిర్మాణం పూర్తయిన వైఎస్సార్ క్లినిక్‌కు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, ఎంపీటీసీ బాజి, గ్రామ సర్పంచి రబ్బానీ, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, షరీఫ్, జేసీఎస్ మండల కన్వీనర్ అబ్బాస్, ముత్యాల బాలస్వామి, రాజేష్, ఎ.సంజయ్‌రెడ్డి, ఉడతా శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, యు.ప్రభాకర్, సుభాని, కె.కిషోర్, కోటేశ్వరరావు, దామరచర్ల కిరణ్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయాల్లోనే చెత్త సేకరించాలి

తాడికొండ: సీఆర్‌డీఏ గ్రామాల్లో నిర్దేశిత సేకరణ సమయాల్లోనే తడి, పొడి చెత్తను సేకరించాలని సీఆర్డీఏ డీఎల్‌డీఓ శ్రీనివాసరావు అన్నారు. గురువారం తుళ్లూరు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఆర్డీయే గ్రామాలతో పాటు సీఆర్డీఏలో లేని గ్రామాలైన తుళ్లూరు మండలం వడ్డమాను, పెదపరిమి, హరిశ్చంద్రపురం గ్రామాలను కలుపుకొని రెండు కంప్యాక్టర్స్ లారీలు ఎంపీడీఓ ఆధ్వర్యంలో పనిచేస్తాయని ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఆర్డీఏ గ్రామాల్లో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది పనిచేయాలని సూచించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ శేఖర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మంగళగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని, ప్రతి విద్యార్థి పాఠశాలల్లోనే భోజనం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ విజయలక్ష్మి అన్నారు. నగరంలోని బీఆర్ నగర్ మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలను గురువారం సందర్శించి రికార్డులను తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులను రుచి, నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు.

వాస్తవాలను వక్రీకరించడం తగదు

ప్రత్తిపాడు: వాస్తవాల్ని వక్రీకరిస్తూ ఎల్లో మీడియా వార్తల్ని ప్రసారం చేయడం మానుకోవాలని ప్రత్తిపాడు జెడ్పీటీసీ సభ్యుడు విప్పాల కృష్ణారెడ్డి సూచించారు. కొండేపాడులో బుధవారం రాత్రి జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తులు ఎమ్మెల్యే సుచరితను నిలదీసినట్లు, ఊరి నుంచి వెళ్లిపోండి అన్నట్లుగా ఓ చానల్ వార్తల్ని ప్రసారం చేయడాన్ని జెడ్పీటీసీ గురువారం తీవ్రంగా ఖండించారు. అది పూర్తిగా సత్యదూరమని చెప్పారు. వాస్తవానికి కొందరు సాంకేతిక కారణాల వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు కొన్ని అందుతున్నాయని, మరికొన్ని అందడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారన్నారు. అప్పటికప్పుడు స్పందించిన ఎమ్మెల్యే సుచరిత సంబంధిత వ్యక్తుల పేర్లు నమోదు చేసుకుని, వారి అర్హతను పరిశీలించి, అర్హులైతే వెంటనే వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీరమ్యతో పాటు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వాలంటీర్లుకు ఆదేశాలు జారీ చేశారని జెడ్పీటీసీ చెప్పారు. అయినప్పటికీ వాస్తవాన్ని వక్రీకరించి కథనం ప్రసారం చేయడం మంచి పద్ధతి కాదని తెలిపారు. ఇకనైనా తీరు మార్చుకోవాలని కృష్ణారెడ్డి సూచించారు.

కమ్యూనిటీ హాల్ ప్రహరీకి రూ.35 లక్షలు మంజూరు



కమ్యూనిటీ హాల్ ప్రహరీ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం రాధారంగా నగర్‌లో గతంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా నాయకుడు కత్తిక మల్లికార్జునరావు (బుల్లబ్బాయి) నిర్మించిన కమ్యూనిటీ హాల్ చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు కార్పొరేషన్ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి గురువారం కార్పొరేషన్ సాధారణ నిధులు నుంచి రూ. 35 లక్షలు కేటాయించారు. ప్రహరీ నిర్మాణ పనులు ఏ విధంగా చేయాలనది పరిశీలించేందుకు కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి ఇంజినీరింగ్ సిబ్బందితో వడ్డేశ్వరం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే బుధవారం వడ్డేశ్వరంలో పర్యటించారని, ఈ సమయంలో రాధారంగా నగర్‌కు చెందిన వారు, గ్రామ పెద్దలు కమ్యూనిటీ హాల్ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరడంతో కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి రూ.35 లక్షలు కేటాయించి 250 మీటర్ల పొడవు, 6 అడుగుల ఎత్తులో చుట్టూ ప్రహరీ నిర్మించనున్నామని ఆయన అన్నారు. ఇంజినీరింగ్ సిబ్బంది మార్కింగ్ చేశారని, త్వరలోనే ఈ పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

చాకలి ఐలమ్మ కమ్యూనిటీ హాల్ పనుల పరిశీలన..

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని కొత్తూరు రైల్వే ట్రాక్ పక్కనే నిర్మిస్తున్న చాకలి ఐలమ్మ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను గురువారం ఎంటీఎంసీ ఏఈ ప్రవీణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు గత కొద్దికాలంగా నిలిచిపోయాయని, ప్రస్తుతం ఆ పనులు వేగవంతం చేశామని కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో గ్రావెల్ ఫిల్లింగ్ చేసి పిల్లర్లను శ్లాబ్ లెవల్‌కి తీసుకువచ్చామని, రెండు మూడు రోజుల్లో సెంట్రింగ్ పనులు పూర్తి చేసి శ్లాబ్ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు.

కేఎల్‌యూలో మహిళా మహోత్సవం

హాజరైన ప్రముఖులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గీత, వాసవి, జగన్నాథరావు

తాడేపల్లిరూరల్: స్థానిక వడ్డేశ్వరం కె.ఎల్.విశ్వవిద్యాలయంలో మహిళా మహోత్సవ కార్యక్రమాలు గురువారం ఆరంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ మోహన్, డీఐజీ రాజకుమారి, మీడియా మింట్ హైదరాబాద్ డి.గీతా, సీఈవో పల్లవి, హైదరాబాద్ ట్రిపుల్‌ఈ హరి వైదగ్ని, విజయవాడ దిశ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వాసవి, మిసెస్ ఆంధ్రా పి. చంద్రికలు విచ్చేశారు. ఈ సందర్భంగా యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి వాణిమోహన్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అంతర్జాతీయ మహిళా దినోత్సవం అనేది మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ విజయాలను గుర్తు చేసేదిగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించిందన్నారు. దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో దిశ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయడం చారిత్రకమన్నారు. డి.గీత మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ప్రొ చాన్సలర్ డాక్టర్ కె.ఎస్.జగన్నాధరావు, వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారధి వర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు, ఫెమ్ ఫ్లేర్ కన్వీనర్లు డాక్టర్ హేమదివ్య, డాక్టర్ రూతు రమ్య, డాక్టర్ హేమమాలిని, డాక్టర్ పద్మావతి, డాక్టర్ శ్రీకావ్య, సాహితి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



వలంటీర్ కుటుంబానికి నగదు అందజేస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జడ్పీటీసీ అరుణ

తాడేపల్లిరూరల్: మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి తన ఔదార్యాన్ని మరోమారు చాటుకున్నారు. గురువారం దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో నల్లమేకల వారి పాలెంలో ఇటీవల అనారోగ్య కారణంగా మృతిచెందిన వలంటీర్ కుర్రా సురేంద్ర కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ ఆర్థికసహాయాన్ని గురువారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణ, వైఎస్సార్ సీపీ నాయకులు దానబోయిన వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఆ కుటుంబానికి అందజేశారు. అదేవిధంగా ఇదే గ్రామానికి చెందిన దానబోయిన ముత్తయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకుని రూ.20వేలు ఆర్థికసాయాన్ని ఆ కుటుంబానికి అందజేసి వారికి ఆసరాగా నిలిచారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

తోపుడు బండ్లు అందజేత



తాడేపల్లిరూరల్: మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సౌజన్యంతో దుగ్గిరాల మండలం తుమ్మపూడిలో చిరువ్యాపారం చేసుకునే వారికి గురువారం తోపుడు బండ్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆర్కే దుగ్గిరాల మండల పరిధిలో ఏ పేదవాడు కష్టాల్లో ఉన్నా తన సొంత డబ్బులను వారికి అందజేస్తున్నారని, మండల వ్యాప్తంగా చిరు వ్యాపారులు అద్దె తోపుడు బండ్లతో వ్యాపారం నిర్వహిస్తున్నారని, వారిని కూడా ఆదుకునేందుకు గ్రామాల వారీగా తోపుడు బండ్లు అందజేస్తున్నారన్నారు. ఈక్రమంలో తుమ్మపూడి గ్రామంలో నివాసముండే నల్లమామిడి శివయ్య, చెక్కా నాగలక్ష్మి, మన్నవ నాగరాజు, షేక్ చిన్న మౌలాలి ఎమ్మెల్యే తన సొంత నిధులతో తోపుడు బండ్లు అందజేశారన్నారు.

శభాష్.... సాదియా ఆల్మస్

- పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అత్యంత ప్రతిభ
- రెండు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధన
- అభినందించిన పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్



ఆల్మస్‌ను అభినందిస్తున్న గుమ్మడి పుల్లేశ్వరరావు, కోచ్ ఎస్‌కే సంధానీ

మంగళగిరి: జమ్మూ కాశ్మీర్‌లో గత నెల 23 నుండి 27వ తేదీ వరకు జమ్మూ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ కప్ ఇండియా పోటీల్లో పట్టణానికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ సాదియా ఆల్మస్ అత్యంత ప్రతిభను చాటినట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి గుమ్మడి పుల్లేశ్వరరావు తెలిపారు. నగరంలోని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన వివరాలను వెల్లడించారు. జమ్మూ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ కప్ ఇండియా పోటీల్లో సాదియా ఆల్మస్ 57 కేజీల మహిళా విభాగంలో రాష్ట్రం తరపున పోటీ చేసి రెండు గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. స్క్వాట్ 195 కేజీల బరువునెత్తి గోల్డ్ మెడల్ జూనియర్ నేషనల్ రికార్డు, బెంచి ప్రెస్ 77.5, డెడ్ లిఫ్ట్ 182.5 కేజీల బరువునెత్తి గోల్డ్ మెడల్ జూనియర్ నేషనల్ రికార్డు సాధించినట్లు పుల్లేశ్వరరావు తెలిపారు. పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ సాధించిన సాదియా ఆల్మస్‌కు కోచ్ ఎస్‌కే సంధానీతో పాటు పలువురు క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

ప్రాంగణ ఎంపికల్లో చలపతి విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, కంపెనీ ప్రతినిధులు

మోతడక(తాడికొండ): మెయిన్ టెక్ టెక్నాలజీస్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి తమ కళాశాలకు చెందిన ఆఖరి సంవత్సరం విద్యార్థులు 41 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని మోతడక చలపతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రంగారావు తెలిపారు. కంపెనీ హెచ్‌ఆర్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపిక ప్రక్రియలో విద్యార్థులకు ఆప్టిట్యూడ్, టెక్నికల్, ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించగా మోతడక సీఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 28 మంది, లాం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 17 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన ఉద్యోగులకు వార్షిక వేతనం రూ.4 లక్షలు ఉంటుందని, చెన్నై, బెంగళూరు, నోయిడాకు చెందిన కంపెనీలలో వారు పని చేయాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు, కళాశాల కార్యదర్శి వై.సుజిత్ కుమార్, ప్రిన్సిపాల్ తదితరులు అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నాగ శ్రీనివాసరావు, ఉపాధి కల్పనాధికారులు ఎ.శ్రీనివాస్, డాక్టర్ యు.గోపీరాజు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి

తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సీపీఎం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు డిమాండ్ చేశారు. గురువారం దుగ్గిరాల గ్రామంలోని శివాలయం సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం డొమెస్టిక్ వంటగ్యాస్‌పై రూ.50 , వాణిజ్య సిలెండర్‌పై రూ.350 పెంచడం దారుణమన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటి ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్ల కిందట రూ.417 ఉన్న సిలెండర్ నేడు రూ.1155 అయ్యిందని, గ్యాస్‌పై కేంద్రం ఇచ్చే సబ్సిడీని ఎత్తివేశారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలను ఉపసంహరించుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు. సీపీఎం నాయకులు వి.సాంబశిరావు, ఎన్.యోగేశ్వరరావు, వై. బ్రహ్మేశ్వరరావు, పాములు, అమ్మిరెడ్డి, ఎం.యేసుపాదం, సీహెచ్ పోతురాజు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలసిన బార్ ప్రతినిధులు



హైకోర్టు జడ్జి డీవీఎస్ సోమయాజులును కలసిన మంగళగిరి బార్ అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి: మంగళగిరిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న అదనపు జిల్లా కోర్టుతో పాటు ప్రస్తుత కోర్టు భవనాల మరమ్మతుల విషయంలో సహకరించాల్సిందిగా హైకోర్టు న్యాయమూర్తి, గుంటూరు జిల్లా ఫోర్ట్ ఫోలియో జడ్జి డీవీఎస్ సోమయాజులును బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. గురువారం మంగళగిరి బార్ అసోసియేషన్ ప్రతినిధులు హైకోర్టు న్యాయమూర్తి డీవీఎస్ సోమయాజులును మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. హైకోర్టు జడ్జి డీవీఎస్ సోమయాజులును కలిసిన వారిలో మంగళగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులు దొడ్డక బ్రహ్మానందరావు, ప్రధాన కార్యదర్శి తోట నరసింహారావు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేటూరి కిషోర్, ఉపాధ్యక్షుడు జొన్నాదుల లెనిన్ బాబు, కోశాధికారి రెంటపల్లి రాజేష్, కార్యవర్గ సభ్యులు కుడారి శేఖర్ బాబు, సూరబోయిన మురళీకృష్ణ, చేతన్ తదితరులు ఉన్నారు.

రిచిగాడి పెళ్లి చిత్రయూనిట్ ఉండవల్లి రాక



హీరో మారిశెట్టి కిషోర్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఉండవల్లికి చెందిన యువ హీరో కిషోర్ మారిశెట్టి ప్రధాన పాత్రలో నటించిన చలనచిత్రం రిచిగాడి పెళ్లి ఉండవల్లి సెంటర్‌లో నేడు విడుదల కానున్న సందర్భంగా గురువారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో కిషోర్ మాట్లాడుతూ తాను నటించి, నిర్మించిన చలనచిత్రం రాణి ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో రిలీజ్ అయ్యి ట్రెండింగ్‌లో దూసుకు పోవడం తనకు సంతోషంగా ఉందని అన్నారు.
అదేవిధంగా కేఎస్ ఫిల్మ్ వర్క్స్ పతాకంపై కేఎస్ హేమరాజ్ దర్శకత్వంలో నవీన్‌నేని, సత్య, ఎస్‌కె ప్రణీత పట్నాయక్, తదితరులతో కలిసి నటించిన ఫీల్ గుడ్ ఎమోషనల్ డ్రామా రిచిగాడి పెళ్లి ట్రైలర్ ఇప్పటికే ప్రేక్షకుల్ని ఆకట్టుకుందని అన్నారు. తమను ఇంతగా ఆదరిస్తున్న తెలుగుప్రేక్షకులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

మత్తులో విద్యార్థుల భవిష్యత్తు చిత్తు

మంగళగిరి: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వల్ల విద్యార్థుల జీవితాలు నిలువులా నాశనమవుతాయని మంగళగిరి రూరల్ ఎస్ఐ టి.రమేష్ బాబు అన్నారు. గురువారం మంగళగిరి రూరల్‌పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో మహిళా పోలీసులకు మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ టి.రమేష్ బాబు మాట్లాడుతూ సరదాగా అలవాటు చేసుకుని, చివరికి మత్తు పదార్థాలు లేకుంటే ఉండలేని స్థితికి వస్తారని, మత్తు మైకంలో చదువుకు దూరమవుతూ విలువైన జీవితాన్ని నిరీర్యం చేసుకుంటున్నారన్నారు. నవజీవన్ బాల భవన్ క్లినికల్ సైకాలజిస్టు డాక్టర్ షీలా నికోలస్ మాట్లాడుతూ సచివాలయ మహిళా పోలీసులు మాదక ద్రవ్యాల వినియోగంపై వాటి వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలన్నారు. సైకాలజిస్టు జి.అనూష మాట్లాడుతూ కుటుంబ సభ్యులు, స్నేహితులతో అత్యధిక సమయం గడిపితే ఒంటరితనాన్ని జయించవచ్చన్నారు. ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, జోనల్ కో-ఆర్డినేటర్ బి. రమేష్, మంగళగిరి, దుగ్గిరాల సచివాలయాల క్లస్టర్ల మహిళా పోలీసులు పాల్గొన్నారు.